## Press Release

# కృష్ణా తీరాన అమరావతి విశ్వసంగీత, నృత్య వేడుక

## 'పవిత్ర సంగమం' వేదిక

### ఈనెల 10 నుంచి 13 వ తేదీవరకు సాంస్కృతిక సందడి

### అమరావతికి ప్రాచుర్యం, ఆంధ్రుల ఆతిథ్యం

### విజయవాడలో ప్రపంచ స్థాయి సంబరం

అమరావతి, ఫిబ్రవరి 8: నదులే కాదు. అక్కడ జాతీయ, అంతర్జాతీయ సంగీతాలూ అనుసంధానం కానున్నాయి. అక్కడ రెండు నదులే కాదు. అనేక నాట్యాలు ఒకే వేదికమీద సవ్వడి చేయనున్నాయి. కృష్ణాతీరాన కళలు ప్రవహించనున్నాయి. కృష్ణాజిల్లా కొండపల్లి సమీపాన ఈనెల 10వ తేదీ నుంచి 13 వతేదీవరకు అమరావతి విశ్వసంగీత, నృత్యవేడుక కమనీయంగా, రమణీయంగా జరగనుంది.

పవిత్ర సంగమ ప్రాంతం సంగీత, నాట్య సమలంకృతంగా భాసించనుంది. అనేక కళల లయాన్విత ఘోషతో కృష్ణానదీ తీరం తీయగా ఉలిక్కిపడే సమయం సమీపిస్తోంది. ఒకే వేదిక రెండు మహా ఉత్సవాలకు వేదిక కానుండటం విశేషం. పవిత్ర సంగమం దగ్గర ఇక్కడే ఈనెల 10,11,12 తేదీల్లో జాతీయ మహిళా పార్లమెంటు సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు.

రాజధాని అమరావతికి ప్రాచుర్యం కల్పించటం, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ నృత్యం కూచిపూడి, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకతలను ప్రతినిధులకు పరిచయం చేయటం అమరావతి విశ్వసంగీత, నృత్య వేడుక ఉద్దేశం. జాతీయ మహిళా పార్లమెంట్ సదస్సుకు వచ్చిన ప్రతినిధులకు ఆతిథ్యమిస్తూనే ఆంధ్రప్రదేశ్ పర్యాటకం,ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం, కళా సాంస్కృతిక రంగాల ప్రత్యేకతలను చాటిచెప్పటం ధ్యేయం.

ఈనెల పదో తేదీ శుక్రవారం సాయంత్రం గం. 5 కు సుందరరామ శ్రోతిగల్ (Sroutigal) బృందం వారిచే సామవేద పఠనం ఉంటుంది. వేదాల్లో సంగీతాన్ని ప్రస్తావించే సామవేదం ప్రత్యేకతలను ఈ సందర్భంగా వివరిస్తారు. సాయంత్రం గం. 5.15 ని.లకు గోనుగుంట్ల సోదరులు సాయిబాబు, నాగరాజుల నాదస్వర కచేరీ ఉంటుంది.

సుషిర వాద్యాలలో సునాదంగా, మంగళవాద్యమైన గోనుగుంట్ల సోదరుల నాద సరాగాల్ని, సురాగాల్ని కృష్ణవేణి అలలురిక్కించి వినే శుభసంధ్యా సమయం సమీపిస్తోంది. సాయంత్రం గం. 6:00కు ఆంధ్రదేశం తనదంటూ సగర్వంగా చాటుకునే కూచిపూడి కళా ప్రాంగణం నుంచి వచ్చిన సుప్రసిద్ధ నర్తకి వైజయంతి కాషి కృష్ణమ్మకు నృత్యహారతి ఇస్తారు. ఆమె శృతిలయల సవ్వడులు ప్రేక్షకులను పారవశ్య స్థాయికి తీసుకెళతాయి.

రాత్రి గం.7.15 ని.లకు కథక్ నృత్య యశస్సును ప్రపంచానికి చాటిన పద్మవిభూషణ్ పండిట్ బిర్జు మహారాజ్ కళా ప్రదర్శన ప్రేక్షకులను సమ్మోహితుల్ని చేయనుంది. ఆయన కథక్ నృత్యరీతికి సంబంధించి కాల్కా-బిందదిన్ ఘరానాల్లో ప్రసిద్ధులు.

రాత్రి గం.8.20 ని.లకు మనసుపొరలను సుతారంగా స్పృశించే విఖ్యాత వయొలిన్ విద్వాంసులు ఎల్. సుబ్రహ్మణియం హృద్యమైన వాయులీనాన్ని, కజకిస్తాన్ దేశ శ్రోతలను దశాబ్దాలుగా ఆనందడోలికల్లో ముంచెత్తుతున్న కజక్ స్టేట్ ఫిలాంత్రోఫిక్ ఆర్కెస్ట్రా వాద్యవిన్యాసాల్ని సమ్మిళితంగా ఆస్వాదించవచ్చు.

తన మనోనేత్రంతో సంగీత సాగరపు అంచులు చూసిన వయొలిన్ విద్వాంసుడు, ఆంధ్రులు గర్వించే కళాకారుడు ద్వారం వెంకటస్వామి నాయుడు ఇప్పుడు లేకపోవచ్చు. కానీ వాయులీనాన్ని నవ్యప్రయోగాలతో రాగసరాగాలతో ప్రపంచ వేదికలపై ప్రేక్షకులను అలరించిన వాయులీన విద్వాంసుడు ఎల్ సుబ్రహ్మణ్యం పవిత్రసంగమం దగ్గర తన వాద విద్వత్తును ప్రదర్శించునున్నారు.

పదకొండో తేదీ శనివారం సాయంత్రం: గం.5.30 ని.లకు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తలనపై వివేక్ సదాశివం ప్రత్యేక కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం గం.6.05 ని.లకు విఖ్యాత వైణికురాలు డా. మాధురీదేవి 'నవరస వీణ'తో ప్రేక్షకుల మనసు మీటుతారు.

రాత్రి. గం 7.15 ని.లకు భారతీయ చలన చిత్ర నేపథ్యగాయని కవితా కృష్ణమూర్తి బృందం లైవ్ షో ఉంటుంది. తెలుగు ప్రేక్షకులకు స్వరపరిచితురాలైన కవితా కృష్ణమూర్తికి అనేక విజయవంతమైన గీతాలను ఆలపించిన ఖ్యాతి ఉంది. పవిత్రసంగమం వేదికపై ఆమె పాటకు బాలీవుడ్ నృత్య కళాకారిణుల ఆటతోడై ప్రేక్షకులను అలరించనుంది.

రాత్రి గం.8.20ని.లకు కృష్ణాతీరంలో ప్రేక్షకలోకాన్ని ఆధ్యాత్మిక తీరం చేర్చేందుకు అనూప్ జలోటా భజనావళితో, గజల్ గానంతో ముందుకు వస్తారు. ఉత్తరాదిన ఇంటింటి నాదంగా పల్లవిస్తున్న అనూప్ జలోటా భజన తత్వాన్ని తెలుసుకునే పుణ్యకాలం వీక్షకులకు వచ్చింది. సంచారంతో కళలను కళ్లముందుంచి విశ్వమంతా పర్యటించి భారతీయ జానపద కళల్ని దేశవిదేశాల్లో చాటుతున్న కళాకారుడు పూర్ణదాస్ బాల్ తన గానంతో, జానపద ధ్వానంతో గుమ్మెత్తిస్తారు. తర్వాత విఖ్యాత గాయకుడు, ఆధ్యాత్మిక శైలితో కూడిన 'సుర్'గీతాలలో ఖ్యాతి గడించిన సురేష్ వాడేకర్ కచేరీ ఉంటుంది. ఆయన భారతీయ భాషలలో ఆధ్యాత్మిక గీతాలాపనలో ప్రసిద్ధులు. అనేకమంది సినీ సంగీతదర్శకులకు సహాయకుడుగా పనిచేశారు.

ఇక అక్షరాలకు అద్దాల మేడలు కట్టి గుండె ఊసులను వినిపించే గజల్ ప్రక్రియలో జగమెరిగిన తలత్ అజీజ్ ప్రేక్షకులను రంజింపజేస్తారు.

పన్నెండవ తేదీ ఆదివారం సాయంత్రం గం.5.30 నిలకు వేలికొసలతో వేవేల ధ్వానాలతో, ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకునే మృదంగ మాంత్రికుడు ఎల్లా వెంకటేశ్వరరావు తనవాద్య విన్యాసంతో వీనుల విందు చేయనున్నారు.

సాయంత్రం గం. 6.05 ని.లకు ఘటవాద్య విద్వాంసుడు వికు వినాయకరామ్,స్వామినాథన్‌లు తమ వాద్య విన్యాసాలతో అలరిస్తారు. రాత్రి గం.7.15 నిలకు విఖ్యాత తబలా వాద్యవిద్వాంసులు అనిందో– అనుబ్రతా చటర్జీల వాద్యగోష్టి ఉంటుంది. ప్రపంచంలో ఆధునిక డ్రమ్స్ వాదనంలో, ముఖ్యంగా పెర్కూషన్‌లో ఖ్యాతి గడించిన త్రిలోక్ గురుతు, భారతీయులు గర్వించదగిన దక్షిణ భారత దేశ డ్రమ్మర్ శివమణిల వాద్యం ఆదివారం రాత్రి 8.గంటల 10 నిమిషాలకు ప్రారంభమవుతుంది. రాత్రి గం.9.30 ని.లకు ఎల్ సుబ్రహ్మణియం ఫ్రెండ్స్ ప్రత్యేక కార్యక్రమం ఉంటుంది.

పదమూడో తేదీ ముగింపు రోజు సోమవారం సాయంత్రం గం.5.30 నిలకు చాహు (chau dance) నృత్యం చూడవచ్చు. సాయంత్రం గం.6.05 ని.లకు వయొలిన్ ద్వయం ద్వారం దుర్గాప్రసాద్, సత్యనారాయణరావు తమ వాయులీనంతో ప్రేక్షకులను అలరిస్తారు. రాత్రి గం.7.15 ని.లకు సోలో సిస్కోకో, జినో లిజ్స్టేస్‌ల గ్లోబల్ ఫ్యూజన్ సంగీత సమ్మేళనం యువతరాన్ని గుమ్మెత్తించనుంది.

భారతీయ సంగీతాన్ని, విదేశీ పాప్, రాక్, జాజ్ పరిమళాలు అద్ది వినూత్న సంగీతంతో ఆకట్టుకునే యువ సంగీతకారుడు సుబ్రమేనియా ప్రదర్శన కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. రాత్రి గం. 8.40 ని.లకు జలతరంగ్ వాద్యంపై మంగళంపల్లి దీప్తి మంత్రముగ్ధులను చేస్తారు.

మేఘ మల్హారం వెళ్లిపోయి చాలా కాలం అయ్యింది. మేఘాలు లేని లోటును తీర్చి, రాగవర్షం కురిపించటానికి, పవిత్ర సంగమాన్ని కళానురాగ సంగమంగా మార్చేందుకు విశ్వ సంగీత విద్వాంసులంతా విచ్చేస్తున్నారు.

స్వరములు ఏడైనా రాగాలెన్నో ఉంటాయి. కానీ సమీప భవిష్యత్తులో అమరావతి లాంటి విశ్వశ్రేణి రాజధాని ఒక్కటే ఉంటుంది. రాష్ట్ర విభజన తర్వాత ఘనమైన సాంస్కృతిక, సాహితీ వారసత్వాన్ని ప్రతిఫలించే అమరావతి పేరు పెట్టుకుని వడివడిగా ప్రగతివైపు అడుగులు వేస్తోంది నవ్యాంధ్రం. అమరావతికి ప్రాచుర్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఈ ఉత్సవం కన్నులపండువగా, వీనుల విందుగా జరగనుంది.